# సాక్ష్యం లేని హత్య

డి. కామేశ్వరి



"ఐ లవ్ యు. ఐ లవ్ యు డార్లింగ్...
నీవు లేని ఈ జీవితం నాకొద్దనిపిస్తోంది. ప్లీజ్ డియర్ నా మాట విను.... అతనికి డైవర్స్ యిచ్చేయి- నా దగ్గరికి వచ్చేయి- పోనీ డైవర్స్ అక్కరలేదు. అలా వచ్చేయి.... ఎన్నిసార్లు అడిగినా నా మాటకి జవాబు చెప్పవు.... నీ ఉద్దేశం ఏమిటసలు? నిజంగా నా మీద ప్రేమ వుంటే అతన్ని వదలడానికెందుకిష్టపడవు? ఇవాళ ఏదో ఒకటి తేల్చి చెప్పు.... ఇంక ఈ టార్చర్ నేను సహించలేను–" అతను.

"డియర్ ఎన్నిసార్లు చెప్పాలి నీకు.... నీకు తెలుసు. నేను రాలేని కారణం.... అతను బతికుండగా నేను ఆయన్ని వదిలి రాలేను–" ఆమె–

"అంతేనా....ఆరోజు ఎప్పుడు వస్తుంది? వచ్చేవరకు నేను నీ కోసం రోజూ చస్తూ బతకాలా?" అతని కంఠంలో కోపం.

"డోన్ట్ బి ఫూలిష్.. పదేళ్ళు కాపురం చేసిన భర్త అవిటివాడయ్యాడని నిరాధారంగా ఎలా వదిలిరాను? వచ్చినా ఆ పాప చింతనతో నీతోఆనందంగా వుండగలనా?"

"ప్లీజ్ గో ఎవే.. నాకింకేం చెప్పకు.... వెళ్ళు.... అసలు నీవెందుకు కనిపించావు నాకు?....అసలు నిన్నెందుకు ప్రేమించాను నేను?– నన్నెందుకిలా హింసిస్తున్నావు? వెళ్ళు. నేను నీకేం కాను.. ప్లీజ్ నన్ను వదిలి వెళ్ళు" అతని ఆక్రోశం–

* * *

'అతను వున్నన్ని రోజులు అతన్ని వదిలి రాలేదు.. అంటే ఆమె రావాలంటే అతను చావాలి.. ఆ రోజు కోసం ఎన్నాళ్ళు వేచి చూడాలి? ఆ రోజు తొందరలో వస్తుందన్న ఆశ లేదు.. ఎందుకు లేదు?.. ఆ రోజు వచ్చేట్టు తను చెయ్యలేడా? ఆరోజు త్వరలో తను తెప్పిస్తే? అప్పుడు ఆమె వస్తుంది.. ఇన్నాళ్ళూ ఈ ఆలోచనెందుకు రాలేదు తనకి? వట్టి ఫూల్ తను....'

* * *

"పది వేలు."

"పది వేలే!"

"మనిషి ప్రాణం పది వేలన్నా చేయదంటారా సార్?"

"సరే.... కాని చాలా జాగ్రత్తగా.... ఏ చిన్న ఆధారం వదలకుండా. ఎవరికీ నా మీద అనుమానం రాకుండా పని జరగాలి."

"సార్....పదేళ్ళ సర్వీస్ నాది.... ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో తెలుసు – ఆ మనిషి వివరాలు చెప్పండి."

"ఇదిగో యింటి నంబరు- వీధి పేరు.. అతను మిలిటరీలో మేజర్‌గా పనిచేశాడు. యుద్ధంలో రెండు కాళ్ళు పోయాయి— ఎప్పుడూ వీల్ చెయిర్‌లో కూర్చుంటాడు. అతను బొమ్మలు వేస్తుంటాడు. అతని భార్యకి కాలేజీలో ఉద్యోగం. మధ్యాహ్నం మూడు నాలుగు మధ్య మంచి సమయం– ఆవిడ ఐదు వరకు యింటికి రాదు. అతను మూడు గంటలకి లేచి బొమ్మలు వేసుకుంటాడు. ఆ టైముకి పని జరిగిపోవాలి. కాళ్ళు లేనివాడు- పని సుళువుగా అయిపోతుంది ...చాలా జాగ్రత్తగా....ఏచిన్న క్లూ దొరకనీయకుండా జరగాలి. ఇదిగో ఐదు వేలు– పని పూర్తయ్యాక మిగతాది."

* * *

"ఏం-పని సవ్యంగా జరిగినట్టేనా ...." అతని ఆరాటం.

"ఓ....యీ అబ్దుల్‌గాడి దెబ్బనించి ఏ పిట్టా తప్పించుకోలేదు."

"ఎక్కడా ఏ ఆధారం వదలలేదుగా? గ్లౌస్ వేసుకున్నావా? చెప్పినట్టు రివాల్వర్‌కి సైలెన్సర్ పెట్టడం మరిచిపోలేదుగదా? నీవు యింట్లోకి వెళ్ళడం,రావడం ఎవరూ చూడలేదుగదా?" గాభరా.

"సార్ మీకెందుకు భయం,అన్ని జాగ్రత్తలూ ఎలా చేసుకోవాలో నాకు తెలుసు. ఒక్క గుండుకి నేలకి ఒరిగాడు. అంతే.... అయితే అనుకోకుండా ఆ వేళకి ఒకావిడ లోపలికి వచ్చింది. ...."

"ఆ....ఆ....ఎవరావిడ? ఎవరు?....నీవు చంపడం చూసిందా?" భయం. చెమటలు.

"ఎవరో తెల్లగా. పొడుగ్గా. అందంగా వుంది. లోపలికొచ్చి నోట మాట రాకుండా నిశ్చేష్టురాలై చూసింది."

"ఓ గాడ్"కీచు గొంతుతో కేక పెట్టాడు.

"గాభరాపడకండి సార్. మరేం భయం లేదు. ఆవిడ నోరెత్తే లోపలే ఆవిడ్ని ఒక్క గుండుకి కాల్చి పారేశాను."

(ఫ్రెడరిక్ ఫ్రాస్ట్ పెద్దకథ చదివాక)